క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి

నిడదవోలు రూరల్: పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా వ్యర్థాలు లేకుండా డంపింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు


ఉండ్రాజవరం సుబ్రహ్మణ్య స్వామి

ఉండ్రాజవరం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొర్లేపర


కొర్లేపర వెంకటరత్నకుమార్

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొర్లేపర వెంకటరత్నకుమార్, కార్యదర్శిగా అనంతపల్లి కృష్ణ చైతన్య, కోశాధికారిగా కోటిపల్లి నాగ వెంకట సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల గ్రామం నుంచి కొవ్వూరు పట్టణానికి స్కూటీపై వస్తున్న చీకట్ల సౌజన్య అనే మహిళను వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమైన ఆమెను తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని కొవ్వూరు టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

మున్సిపల్ ఆఫీసుకు విద్యుత్ కాంతులు


మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ లైటింగ్

నిడదవోలు: బుధవారం ఎన్డీయే కూటమి ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిడదవోలు మున్సిపల్ కార్యాలయానికి లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయం విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. అలాగే నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రత్యక్షంగా తిలకించడానికి స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: నాటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం ప్రత్యక్షంగా తిలకించేందుకు ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. బల్లిపాడు, వేగేశ్వరపురం వద్ద గల కాకర్ల రామయ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌సీడీ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారాన్ని మండల ప్రజలు తిలకించవచ్చన్నారు.

అవధూత అమ్మ పుణ్యారాధన ఉత్సవాల ప్రారంభం

ఉండ్రాజవరం: చివటం గ్రామంలోని అవధూత అమ్మ 43వ పుణ్యారాధన మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. తొలి రోజు మంగళవారం పతాకావిష్కరణ, సీతారామస్వామి అభిషేకాలు, గీతా పారాయణ, శ్రీరామ నామ సంకీర్తన, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవధూత రామాలయ సాధు అమ్మ ఆశ్రమ సంఘం సభ్యులు మాట్లాడుతూ బుధవారం సీతారామస్వామికి తులసీ అర్చన, లలితా విష్ణు సహస్ర నామం, అమ్మవారి చరిత్ర పారాయణ జరుగు తాయన్నారు. చివరి రోజు గురువారం నగర సంకీర్తనతో ప్రారంభమై సాధు అమ్మకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పుష్పార్చన, గీతా పారాయణ నిర్వహిస్తామని వివరించారు. మధ్యాహ్నం, రాత్రి అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చినుకు పడితే అంధకారమే

- విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లైన్‌మెన్ కొరత
- సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి
- గ్రామీణ కరెంట్ వినియోగదారులకు అవస్థ
- నిడదవోలు నియోజకవర్గంలో 1,03,800 కనెక్షన్లు


నిడదవోలులోని ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం


అట్లపాడులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నిడదవోలు రూరల్: విద్యుత్ సరఫరా నిలిచిపోతే అంతా అంధకారమే. సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో కరెంట్ పోతే అంతా చీకటే. ట్రాన్స్‌కో నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరిధిలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో లైన్‌మెన్ కొరత వేధిస్తోంది. దీంతో గ్రామీణ విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య తలెత్తితే ఎవరిని అడగాలో తెలియని దుస్థితిలో వారున్నారు. వర్షాకాలంలో ఈదురుగాలులతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో వినియోగదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా లైన్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండడంతో కరెంట్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, మండలం, మోర్త, పెరవలి, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో 1,03,800 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

కీలకమైన లైన్‌మెన్ పోస్టుల ఖాళీ

నిరంతర విద్యుత్ సరఫరా, లైన్ల పర్యవేక్షణలో లైన్‌మెన్‌ది కీలక పాత్ర. అయితే దీర్ఘకాలంగా చాలా లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయక పోవడంతో ఖాళీగా ఉన్నాయి. నిడదవోలు మండలంలోని 23 గ్రామాల్లో గోపవరం, అట్లపాడు, కలవచర్ల, జీడిగుంట, కలవచర్ల, రావివారిగూడెం, తిమ్మరాజుపాలెం, సూరాపురం, ఉనకరమిల్లి, కాటకోటేశ్వరం, రావిమెట్ల గ్రామాల్లో లైన్‌మెన్ లేరు. వివిధ గ్రామాల లైన్‌మెన్ గతేడాదిగా బదిలీపై వెళ్లారు. పక్క గ్రామాల్లోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 జేఎల్ఎంలు మాత్రమే సేవలు అందిస్తున్నారు. ప్రధాన లైన్‌మెన్ లేకపోవడంతో బ్రేక్ డౌన్ అయినా, విద్యుత్ సరఫరా ఆగి, సరఫరాకు అంతరాయం కలిగినా పట్టించుకునేవారు ఉండడం లేదు. ఉదయం పూట కరెంట్ పోతే ఐదారు గంటల వరకూ పునరుద్ధరించని ఉదంతాలు అనేకం ఉన్నాయని విద్యుత్తు వినియోగదారులు వాపోతున్నారు. ఇటీవల అట్లపాడులో రాత్రిపూట కరెంట్ పోతే ఆ రోజంతా చీకట్లోనే ఉన్నామని, మరునాటి మధ్యాహ్నం సరఫరాను పునరుద్ధరించారని ఆ గ్రామస్తులు తెలిపారు. కరెంట్ కోతల ప్రభావంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా సమస్య కూడా తలెత్తుతోంది. తమ సమస్యలు చెప్పుకొందామని సబ్‌స్టేషన్లకు ఫోన్‌చేస్తే లైన్‌మెన్ అందుబాటులో లేరనే సమాధానం వస్తోందని ఆయా గ్రామాల విద్యుత్తు వినియోగదారులు పేర్కొంటున్నారు.

నియోజకవర్గంలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

సబ్‌స్టేషన్లు	గృహాలు	పరిశ్రమలు	వ్యవసాయ కనెక్షన్లు
నిడదవోలు పట్టణం	17,642	422	238
నిడదవోలు మండలం	9,348	342	1727
పురుషోత్తపల్లి	14,276	464	1517
మోర్త	28,015	673	1809
పెరవలి	24,461	780	2086
మొత్తం	93,742	2681	7377

ప్రైవేట్ వర్కర్లపైనే ఆధారం

గ్రామాల్లో కరెంట్ సమస్యలు తలెత్తినపుడల్లా ప్రతి ఒక్కరూ ప్రైవేట్ విద్యుత్ వర్కర్లపై ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతాయి. మరోసారి కరెంట్ పోల్ వద్ద జంపర్లు తెగిపోతాయి. ఇంకోసారి చెట్ల కొమ్మల వద్ద విద్యుత్ తీగలు అతుక్కుపోయి సరఫరా బ్రేక్ డౌన్ అవుతోంది. ఇలాంటప్పుడు ట్రాన్స్‌కో సిబ్బంది ఆయా గ్రామాల్లోని ప్రైవేట్ విద్యుత్ వర్కర్లను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ శాఖలో ప్రైవేట్ వర్కర్లతో పని చేయించడం నిబంధనల ప్రకారం నేరం.ఈ విషయం తెలిసి కూడా తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాన్స్‌కో సిబ్బంది వారి సహాయం తీసుకుంటున్నారు. గతంలో చిన్న చిన్న తప్పులతో కరెంట్ షాక్‌కు గురై పలువురు ప్రైవేట్ వర్కర్లు మృతి చెందారు. విద్యుత్ స్తంభాలపై నుంచి కింద పడి కాళ్లు, చేతులు పోగొట్టుకున్న వారు కూడా ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని విద్యుత్తు వినియోగదారులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం



ట్రాన్స్‌కో నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయం పరిధిలోని సబ్ స్టేషన్లలో వివిధ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, బ్రేక్ డౌన్‌తో పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడినా అందుబాటులో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేసి వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేయిస్తున్నాం. లైన్‌మెన్ కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను.

– బి.వీరభద్రరావు, ట్రాన్స్‌కో ఈఈ, నిడదవోలు

74 వేల హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- నల్లజర్లలో పచ్చిరొట్ట సాగు పరిశీలన


నల్లజర్లలో పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఏడీఏ చంద్రశేఖర్

నల్లజర్ల: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 74 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగుకు ప్రణాళికలు రూపొందించామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. నల్లజర్లలో పచ్చిరొట్ట సాగును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుతుపవనాల రాకతో ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తున్నాయని, వ్యవసాయ పనులకు వాతావరణం అనుకూలంగా ఉందని అన్నారు. జిల్లాలో రైతులు ఇప్పటికే 25 శాతం నారుమడులను సిద్ధం చేశారని చెప్పారు. ఈ నెల 20వ తేదీ నాటికి నారుమడులు పూర్తి చేయాలని సూచించారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అక్టోబర్ నెలాఖరుకు 70 శాతం వరికోతలు పూర్తయ్యేలా రైతులు ముందస్తుగా వరి నాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎంటీయూ–7020 (స్వర్ణ), ఆర్‌బీ బయో, పీఎల్–1100, 5204 (సాంబ మసూరి), 1318 రకాల వరి వంగడాల సాగుకు రైతులు సన్నద్ధమయ్యారని చెప్పారు. అలాగే విత్తనోత్పత్తి కోసం రైతులు 1112, 1153, 1156 రకాలు సాగు చేస్తారని తెలిపారు. నల్లజర్ల మండలంలో అత్యధిక విస్తీర్ణంలో పచ్చిరొట్ట సాగు చేశారన్నారు. ఇందులో జీలుగ రకం అన్ని రకాలుగా రైతులకు ఉపయోగపడుతుందని, చౌడు భూముల్లో కూడా సమర్థంగా పని చేస్తుందని చెప్పారు. 40–45 రోజులు పెరిగిన తర్వాత ఈ పచ్చిరొట్టను భూమిలో కలియదున్నాలన్నారు. దాదాపు 10 రోజుల పాటు మురగ దమ్ములో ఉంచడం మంచిదన్నారు. తద్వారా భూమిలోని జింకు ధాతు లోపాలు నివారించవచ్చని చెప్పారు. వరి నారు మడులకు రెండున్నర కిలోల వంతున రెండు దఫాలుగా యూరియా వేసుకోవాలని, భాస్వరం, పొటాష్ ఎరువులు వాడవచ్చని మాధవరావు అన్నారు. సూక్ష్మపోషకాల లోప నివారణకు రెండుసార్లు జింక్ పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి కమల్ రాజ్, ఏఈఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో డాక్టర్ గూడూరి భేటీ


తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్, తోట రామకృష్ణ

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో వారిద్దరూ ఆయనను కలిశారు. సార్వత్రిక పార్టీ ఓటమిపై చర్చించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భవిష్యత్తులో తామిద్దరం మీ వెంటే ఉంటామని జగన్‌మోహన్ రెడ్డికి తెలిపారు. 2029 ఎన్నికల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చే వరకూ అవిశ్రాంతంగా పనిచేస్తామన్నారు.

అతివల అక్రమ రవాణా నివారణకు తోడ్పడండి

- ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ
- సమస్యలుంటే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి
- కొవ్వూరులో అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో మమ్మి

కొవ్వూరు: మహిళలు, యువతుల అక్రమ రవాణా నియంత్రణకు ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటు అందించాలని హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ కె.బలరామకృష్ణ సూచించారు. మహిళల అక్రమ రవాణా నియంత్రణపై మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో బలరామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగం, ఉపాధి, సినిమా అవకాశాలు ఇప్పిస్తామంటూ మహిళలు, యువతులను మోసగించి, విదేశాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారన్నారు. తమ పరిధిలోని ప్రతి మహిళకూ ఇలాంటి ఘటనలపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళల అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ కో–ఆర్డినేటర్ శ్రావ్య శృతి పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా స్త్రీ,శిశు సంక్షేమం, పోలీసు, విద్య, న్యాయ శాఖల తోడ్పాటుతో ఇప్పటి వరకూ ఆపదలో చిక్కుకున్న 28,200 మంది మహిళలు, యువతులను కాపాడి పునరావాసాలకు చేర్చామని పేర్కొన్నారు. అక్రమంగా రవాణా చేసిన పిల్లల నుంచి శ్రమ, అవయవాల, లైంగిక దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అదీగాక యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫింగ్‌కు గురవుతున్నారన్నారు. అనుమానిత వ్యక్తుల నుంచి మొబైల్ కాల్స్, మెజేస్‌లు వచ్చినపుడు జాగ్రత్త వహించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తినపుడు 1930 అనే ట్రోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. మహిళల, బాలల అక్రమ రవాణాపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం ఉండాలని సూచించారు. లఘు చిత్రాల ప్రదర్శన ద్వారా మహిళల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు.సీడీపీవో మమ్మి, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ శివ, సుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా అవగాహన ర్యాలీ


చాగల్లులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


పెరవలిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాగల్లు: మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా చాగల్లు, బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చాగల్లు పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ చిన్న దోమతో పెద్ద ప్రమాదం అన్నారు. కాబట్టి రానున్న వర్షాకాలంలో ఇంట్లో అయినా, పరిసరాల్లో అయినా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. గృహాల పరిసరాల్లో వాడి పడేసిన టైర్లు, కొబ్బరి బొండాలు, కొబ్బరి చిప్పలు, విరిగిన ప్లాస్టిక్ సామాన్లు, పూల కుండీలు కూలర్లలో నీరు, వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అవుతాయ న్నారు. ఈ దోమల ద్వారానే డెంగీ, మలేరియా, చికున్ గున్యా జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే – ఫ్రై డే పాటించాలని కోరారు. బ్రాహ్మణగూడెంలో వైద్యులు కె.నిశిత, పీఆర్ఎల్ దేవి, వైద్య సిబ్బంది పద్మ, ఎం.రాజశేఖర్, రామకృష్ణ, జమీల, ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కానూరు అగ్రహారం, పెరవలి గ్రామాల్లో ..

పెరవలి: మలేరియా వ్యాధి దోమల వల్లే వ్యాప్తి చెందుతుందని, ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అనేక వ్యాధుల బారిన పడవలసి వస్తుందని కానూరు, పెరవలి పీహెచ్‌సీల వైద్యులు కె.హేమరాజు హెచ్చరించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం కానూరు అగ్రహారం, పెరవలి గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమరాజు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ


చోరీ జరిగిన బీరువా

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడు గ్రామంలోని కంచర్ల గిరి అనే వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. నల్లజర్ల ఎస్ఐ వెంకట సురేష్ కథనం ప్రకారం వ్యాపారి గిరి ఈ నెల 5న కుటుంబ సభ్యులతో కలసి తిరుమల యాత్రకు వెళ్లారు. వారంతా 10న ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. అందులో భద్రపరిచిన 65 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.13 వేల నగదు కనిపించలేదు. దీనిపై గిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలిముద్రల నిపుణులు సోమవారం వచ్చి ఇంటిని పరిశీలించారు. మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకట సురేష్ చెప్పారు.

డాక్టర్ కావడమే లక్ష్యం

- ఏపీ ఈఏపీసెట్ 101 ర్యాంకర్ ఫరా భాను
- కొవ్వూరు డివిజన్‌లో పలువురికి ర్యాంకులు


ఫరా భాను (101వ ర్యాంక్), నిడదవోలు


పెండెం నితేష్ శ్రీసత్య (147వ ర్యాంక్), నల్లజర్ల


కొలసాని సాకేత్ ప్రణవ్ (159వ ర్యాంక్), కొవ్వూరు


కోనాల శరణ్ తేజ అనురూప్ రెడ్డి (189వ ర్యాంక్), అజ్జరం

నిడదవోలు: ఈ ఏడాది నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో కొవ్వూరు డివిజన్‌లోని పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి, అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. నిడదవోలు పట్టణానికి చెందిన ఫరా భాను రాష్ట్రస్థాయి అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ బీఎస్సీ నర్సింగ్ విభాగంలో 101వ ర్యాంకు సాధించింది. మే నెలలో విడుదలైన 2024 నీట్‌లో ఆమె 720 మార్కులకు 667 మార్కులు సాధించింది. ఫరా భాను తండ్రి అబ్దుల్ నౌషద్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌గా పనిచేస్తున్నారు. అబ్దుల్ నౌషద్, కమర్‌జహ దంపతుల ఇద్దరు సంతానంలో చిన్న కుమార్తె ఫరా భాను. డాక్టర్ కావాలనే సంకల్పంతో తాను శ్రద్ధగా చదువుతున్నట్టు ఆమె తెలిపింది.

నితేష్ శ్రీసత్యకు 147వ ర్యాంక్

నల్లజర్ల: ఏపీఈఏపీ సెట్ పరీక్ష ఫలితాల్లో నల్లజర్లకు చెందిన పెండెం నితేష్ శ్రీసత్య రాష్ట్రస్థాయిలో 147వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి దుర్గా ప్రసాద్ దూబచర్ల ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇంగ్లిషు లెక్చరర్‌గా పని చేస్తుండగా, తల్లి ఝాన్సీలక్ష్మి అనంతపల్లి ఎంపీపీ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. ఇంజినీర్ కావాలన్నదే తన ఆశయమని శ్రీసత్య తెలిపాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడాలని..

కొవ్వూరు: స్థానికుడైన కొలసాని సాకేత్ ప్రణవ్ ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 159వ ర్యాంక్ సాధించాడు. అతడి తండ్రి హరినాథ్ గోపాల్ స్థానిక ఆంధ్రా సుగర్స్ కర్మాగారంలో మెకానికల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. తల్లి లలిత గృహిణి. అన్న గౌతమ్ శ్రీకర్ ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. తనకు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావాలన్నదే లక్ష్యమని సాకేత్ ప్రణవ్ తెలిపాడు.

శరణ్ తేజకు 189వ ర్యాంక్

పెరవలి: ఏపీఈఏపీ సెట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని అజ్జరం గ్రామానికి చెందిన కోనాల శరణ్ తేజ అనురూప్ రెడ్డి 189వ ర్యాంక్ సాధించాడు. శరణ్ తేజ్ జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఆలిండియా 62వ ర్యాంక్ సాధించి, ప్రస్తుతం ఐఐటీలో చేరబోతున్నాడు. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేసి కంప్యూటర్ ఇంజినీర్‌గా దేశానికి సేవ చేస్తానని అతడు తెలిపాడు. శరణ్ తేజ తండ్రి వెంకట రామారెడ్డి ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, తల్లి దివ్య గృహిణి.

వెంకట సతీష్‌కు 165వ ర్యాంక్


తల్లిదండ్రులతో 165వ ర్యాంక్ సాధించిన సింహాద్రి వెంకట సతీష్

ఉండ్రాజవరం: ఉండ్రాజవరానికి చెందిన సింహాద్రి దిలీప్ వెంకట సతీష్ ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 165వ ర్యాంకు సాధించాడు. వైజాగ్‌లో ఇంటర్ చదివిన సతీష్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఆధ్యాపకుల ప్రోత్సహంతో ఈర్యాంకును సాధించానని తెలిపాడు. తండ్రి సింహాద్రి శ్రీనివాస్ రైతు, తల్లి మోహన సత్యశ్రీ గృహిణి. ఐఐటి, నీట్‌లో సీటు సాధించాలనేది తన లక్ష్యమని సతీష్ తెలిపాడు.

రేపు మోగనున్న బడి గంటలు


మండల కేంద్రానికి చేరిన పాఠ్య పుస్తకాలు

నల్లజర్ల: పాఠశాల బడి గంటలు ఒక రోజు ఆలస్యంగా గురువారం మోగనున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బుధవారం గన్నవరంలో ప్రమాణ స్వీకారం చేస్తున్నందున, ఉపాధ్యాయ సంఘ నేతల విజ్ఞాపన మేరకు పాఠశాలల పునః ప్రారంభాన్ని ఈ నెల 13కు వాయిదా వేశారు. కాగా రాష్ట్ర విద్యా శాఖ నుంచి మండలంలోని విద్యావనరుల కేంద్రాలకు 53 పాఠశాలల విద్యార్థుల కోసం 16,870 పాఠ్య పుస్తకాలు వచ్చి చేరాయి. బ్యాగులు తప్ప మిగతా విద్యా కానుకలన్నీ వచ్చినట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఈనెల16, 17 తేదీల్లో ఆయా పాఠశాలలకు వాటిని అందించే ఏర్పాటు చేస్తామని ఎంఈఓ తెలిపారు.